
6

4556



4556

# ముక్తి

గణపతిరాజు
అచ్యుతరామరాజు

# మున్నీ

కామధేనువు వంటి ఓ మబ్బూ కల్పవృక్షం లాంటి ఓ మేఘమూ, ఐరావతం లాంటి ఓ మబ్బూ ముద్దుగా, విశాలంగా, ఎత్తుగా తెల్లటి పుణ్యపు ముద్దల్లా పరిగెడుతూ వూరంతా కప్పేసి పాలసముద్రంలా ఉన్న ఆకాశం మీద ఆడుకొంటున్నాయి.

పుణ్యం తెల్లగా వుంటుందట! పాపం నల్లగా ఉంటుందట. మరి పుణ్యంలా అంత తెల్లగానూ ఉండే "ఆంటీ"ని "పాపిష్టిది"అని అమ్మరోజూ ఎందుకు తిడుతూ వుండేది ? ఏ పాపమూ ఎరగని ఆంటీ ఈ రెండు రోజులూ ఒళ్ళంతా కన్నీళ్ల కన్నీళ్లుగా ఏడ్చుకొని ఏడ్చుకొని ఎందుకు వెళ్లిపోయింది? తాను 'మున్నీ'ని చేజేతులా చంపేసినా ఆంటీ తనను పల్లెత్తుమాటయినా అనలేదే! ఆంటీ అమ్మకంటే ఎంత గొప్పది ! ఎంత మంచిది ! !

పట్టణ మధ్యంలో ఓ మధ్యతరగతి యింటి గచ్చు పెరట్లో పట్టెమంచం మీద, వెల్లకిలా పడుకొని ఆకాశంవేపే చూస్తున్న ఆ అబ్బాయి మురళి ఆలోచనల్లో మునిగితేలుతున్నాడు.

ఆ గచ్చుచేసిన పెరట్లో కార్తీక దీపాలు రంగు రంగుల ముగ్గులమధ్య. తులసిచెట్టు చుట్టూ అరటిదొప్పల్లో వెలుగుతున్నాయి ఆకాశంలో నక్షత్రాల్లాగా. మున్నీ లంగామీద జలతారు పువ్వుల్లాగా మెరుస్తున్నాయి. మున్నీ నవ్వుల్లాగా ఎంతో ముద్దుగా ముచ్చటగా మొన్నటిదాకా మెరిసిన దీపాలు ఇవాళ ఎందుకో చీకటిసందుల్లో మురికికొంపల్లోని చమురుదీపాల్లాగా ఉన్నాయి. అవును ! తన కళ్లానే అనిపిస్తున్నాయి. ఈ సాయంత్రింవరకూ తమ ఇంటి పెరట్లో దక్షిణపు గదులు రెండింటిలోనూ అద్దెకివున్న ఆంటీ ఈ వేళే యిల్లు కాళీచేసి వాళ్ళవూరు వెళ్ళిపోయింది. ఆంటీ వెళ్ళిపోయింది!

వేసంగి సెలవులయిపోగానే బడులు తెరుస్తున్న రోజుల్లో ఆరునెలల క్రిందట మున్నీ, ఆంటీ వచ్చారు. వాళ్ళిద్దరూ రిక్షా దిగుతున్నప్పుడు తన తాతయ్యగారింట్లో వున్న ఆవూ, దాని కాళ్ళ మధ్య అడ్డదిడ్డంగా పడుతూ చెంగుని దూకుతూ వుండే బుజ్జి పెయ్యా జ్ఞాపకం వచ్చాయి !

అద్దెకు పుచ్చుకున్న రెండు గదుల్లోనూ ఆంటీ సామానులు సర్దుకుంటు న్నప్పుడు, ఆమెకు సాయం చేస్తూ ఆగదుల్లో ఆటూ ఇటూ తారట్లాడుతున్న మున్నీ చందమామకటూ ఇటూ పరుగెడుతున్న వెన్నముద్దలాంటి పిల్ల మబ్బులా అనిపించింది. వాళ్ళకి సాయం చేయాలని అనిపించి వాళ్ళ గది దగ్గర తాను తచ్చాడుతూ "నన్ను సాయం చెయ్యమంటారా." అని అంటూండ గానే—

"ఒరేయ్! మురళీ! నువ్విలారా ఓ సారి! " అని అమ్మ గట్టిగా కేకేసి పిలిచింది. "నువ్వేం వూరందరికీ సాయం చేయక్కర్లేదుగాని—నీ పుస్తకాలు తీసి చదువుకో! ఫో!" అనిముఖం చిట్లించుకుంది. ఇంకా మా క్లాసు పుస్తకాలు రాలేదమ్మా!" అన్నాడు తాను. "వున్న పుస్తకాలే చదువుకో" అని కసిరింది అమ్మ.

అమ్మకంటే ఆంటీ ఏంతో అందంగా తెల్ల నిండుగా వుంది.

ఆ రాత్రి—నాన్నగారి బెడ్‌రూం పక్కగదిలో తాను పడుకున్నప్పుడు, చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు తనకి. ఆంటీ మున్నీ తన కళ్ళముందు కద లాడారు. పక్క గదిలోంచి అమ్మగొంతు వినిపించింది!

"అడ్డమైన వాళ్ళకీ గదులద్దెకిచ్చేస్తారు మీరు! నామాటే లక్ష్యంలేదు. ఆ దేమైనా మొగుడు చచ్చినదాన్లా వుందా? ఇవాళ రెండు శేర్లు మల్లెపూలు కొన్నది" అంది.

"ఆవిడేం కొనుక్కొంటే మనకెందుకే? మొగుడు లేకపోతే పువ్వులు కొనుక్కోవద్దని వుందా, ఏ శాస్త్రంలో నయినా?" అన్నాడు నాన్న.

"సాయంత్రం దానింటి కెవడో వచ్చేడుగా రజనీ....రజనీ అంటూ! వాడెవడో జులాయి వెధవలా వున్నాడు!" అమ్మ.

"నోర్మూసుకో! తెల్సీ తెలీ కుండా వాగకు"—నాన్న వాళ్ళ గదిలో లైటార్పివేశారు. ఆంటీకి భర్తలేడన్నమాట! భర్తలేకపోతే ఆవిడ పువ్వులు కొనుక్కోకూడదా........ ...?

పొద్దుటే పెరట్లో తాను ముఖం కడుక్కొంటూంటే ఆంటీ వాళ్ళగదిలోంచి వాడిన మల్లెమాలతీసి ఓ మూలను పెడుతూంది. మున్నీ నూతి చప్టామీద ముక్కాలిపీట వేసుకొని, పక్కనున్న బకెట్‌లోని నీళ్ళు పోసుకుంటూంది చెంబుతో. మున్నీ నూతివేపు తిరిగివుంది లంగా వుంది. పైన ఏమీలేవు. వీపు తెల్లటి పలకలా వుంది. ఆ వీపు కింద, పీటమీద, తడిసిన లంగాలోంచి గుండ్రంగా బంతిలా ఉంది మున్నీ!

ఆ పక్క గదిలోంచి ఒకాయన బైటకివచ్చి "రజనీ! నేను త్వరగా వెళ్ళిపోవాలమ్మా మున్నీని బళ్ళో జాయిన్ చేసేసి." అని ఏదో చెబుతూ తనవేపు చూశాడు. అమ్మ అలా అందేమిటి! ఈయన రౌడీలా లేడే! ఇతనికేం పెద్ద చెంపలూ, కోరమీసాలూ, ఎర్రటి కళ్ళూ, నోట్లో బీడీ అవేమీ లేవే! అను కున్నాడు.

మున్నీ ఆకుపచ్చ తువ్వాలుతో ఒళ్ళు తుడుచుకొని, నడుముకది చుట్టు కొని, చుట్టుకొన్న తువ్వాల్లోంచి తడి లంగా జారవిడిచి, పిండి, అక్కడ

దండెం మీద ఆరవేసి తనవేపు తిరిగింది. తన వొళ్ళు ఝల్లుమంది. ఏదో మెరుపు తీగె తన ఒంట్లో జరజరపాకింది. మున్నీ సిగ్గుపడి లేడిపిల్లలా పరిగెత్తింది ఇంట్లోకి. ఆ సిగ్గుల మొగ్గ అప్పుడెంత బావుంది!

మున్నీ కాన్వెంటులో చేరింది.

ఆ వేళ-స్నానం చేస్తూన్న మున్నీని చూచిన దగ్గర్నించీ తనకేదో కొత్త ఉత్సాహం వచ్చింది. క్లాసు పాఠాలు పెరట్లో కూచుని గట్టిగా చదవసాగాడు. సినీమా పాటలు గొంతెత్తి గట్టిగా పాడేవాడు. ఆంటీ వెనకాల ఏదో పని వున్నట్టూ చేరి తిరిగేవాడు. కొత్త బట్టలు ఫాషన్‌గా కుట్టించి వేసుకున్నాడు. దర్జాగా నడవసాగాడు. తనలోని ఈ మార్పులన్నీ మున్నీ గమనించుతోందనే గర్వమూ, సంతోషమూ కలిగేవి తనకి.

ఆ రోజు శ్రావణ శుక్రవారమట. ఆ వేళేదో నోము చేస్తే పుణ్యం వస్తుందట. ఇల్లూ పెరడూ బాగుచేయించి, తుడిపించి, కడిగించి, ఇంటినిండా ముగ్గులు పెట్టించిందమ్మ. స్నానాలు, వంటలూ, కొత్త బట్టలూ, పిలుపులూ ఆ రోజంతా అమ్మ తనకి పుణ్యం కోసం ఎంతో శ్రమపడింది

ఆ సాయంత్రం కాన్వెంటు నుంచి తనూ మున్నీ వొస్తున్నారు. తమ పక్క వీధిలోంచి మలుపు తిరుగుతుండగా కొంచెం చీకటి పడింది జనంవెవరూ తిరగాట్టంలేదు. తమ వెనుకనించి ఎవడో నల్లగా దుక్కలా వున్నవాడు సైకిలు మీద వస్తూ, సైకిలాపి, మున్నీ మెడలో బంగారపు గొలుసు చటుక్కున లాగేసి జోరుగా పోతూంటే తాను దొంగ, దొంగ అని అరుస్తూ వాడి సైకిలు వెనకాల పరిగెత్తేడు. వాడు తన మూతిమీద బలంగా కాలితో తన్ని పారిపోతుండగా తన అరుపులకా చుట్టుపక్కల ఇళ్ళవాళ్లు వచ్చి వాడిని పట్టుకున్నారు. గొలుసు దొరికింది. అప్పుడు మున్నీ తనని రెండు కళ్ళూ ఎన్నో కళ్ళు విప్పుకొన్నట్టు విప్పార్చి చూచింది. రుమాలు తీసి తన మూతిమీద దెబ్బ తగిలినచోట నెత్తురు తుడిచి చల్లటి చేతుల్తో తన చెంపలమీది కన్నీటిని తుడిచి ఓదార్చింది. ఆ వీధిలోఆయనొకరు తమ యింటిదాకావచ్చి దిగబెట్టేరు.

ఇంటికెళ్ళి అంతా చెబితే, ఆంటీ తనని గట్టిగా గుండెలకి హత్తుకుంది.

అప్పుడు ఆంటీ వెచ్చటి మెత్తటి గుండెల్లో తన మొహం దాచేసుకుని బాధని మరచిపోయాడు.

అమ్మ వచ్చి, "ఆడ పిల్లని బడికి పంపేటప్పుడు అలంకారాల్లేకపోతే కుదరదా? మీ ధర్మమా అని మావాడికివాళ ఆయుర్దాయం తీరిపోను" అంది.

"లేదండీ.... శ్రావణ శుక్రవారం గదా అని పిల్లమెడలో గొలుసు వేశాను.... ముచ్చటపడి.... నాకెలాగూ ఏ అచ్చటా ముచ్చటా లేవుగదా...." అంది ఆంటీ. నిలువెల్లా నీరుగారిపోయిన ఆంటీసందిట్లోంని లాక్కుంటూ అమ్మ తనని తీసుకు పోయింది.... మున్నీ ఓ మూలకి ఒదిగిపోయింది.

తాను చేసుకొన్న పుణ్యంవల్లే ఆ దొంగ తన కొడుకుని చంపకుండా వదిలాడని అమ్మ వీధిలో నలుగురితోనూ చెప్పుకుంది.

అమ్మ చేసే వ్రతాల దగ్గరికి ఆంటీని ఆహ్వానించేది కాదు అమ్మ. ఇరుగూ పొరుగూ అందరినీ పిలిచి ఆంటీని పిలవకపోవడం తనకెంతో కష్టం కలిగించింది.

ఆంటీనడిగేశాడు: "మీరు రావేం వ్రతాలకీ" అని వాళ్ళ గదికివెళ్ళి.

"అంత పుణ్యానికి నోచుకోలేదు బాబూ నేనిప్పుడు" అంటూ ఆంటీ ముఖం తిప్పుకొంది.

ఒక్కర్తే ఉన్నప్పుడు అమ్మని "ఏం? ఆంటీని వ్రతాలికి పిలవ్వేం? అందర్నీ పిలుస్తావ్ గదా" అనడిగితే—

"నోర్ముయ్‌రా! నీకెందుకు? అన్నిట్లో దూరతావ్!" అని కసిరేసింది అమ్మ.

పట్టుదలకొద్దీ ఆంటీ దగ్గరికి వెళ్ళి "మీరు వ్రతం చేయండి. మీక్కావల్సినవన్నీ నేనూ మున్నీ బజారుకెళ్ళి తెస్తాం" అన్నాడు.

"వద్దులే బాబూ! మున్నీ నాన్నగారున్నప్పుడే నేను వాటికి నోచుకున్నానంతే ....ఇప్పుడు నా తలవ్రాత మారిపోయింది" అంది ఆంటీ బాధగా.

"అయితే ఇప్పుడు చేయకూడదా?"

"వుఁహు..." అంటీ కళ్ళుతుడుచుకుంది. మున్నీ బిక్కచచ్చిపోయింది.

తన మనసంతా విచారంగా, బాధగా, అయోమయంగా అయిపోయింది.

*   *   *   *

ఆ వేళ కృష్ణాష్టమి, అంటీ గదిలో సందడిగా వుంటే అమ్మకి కనబడకుండా వాళ్ళగదిలోకి వెళ్ళాడు. గోడమీద ఒక ఫోటోలో కాలుమీద కాలు వేసుకొని, సూటులో దొరలాగా కూచున్న ఆయన నవ్వుతున్నాడు దర్జాగా. ఆఫోటోకి ఒక పెద్ద మల్లెదండ వుంది. అంటీ ఆ ఫోటోకి నమస్కారంచేసి ఆ వాడిన దండతీసి యింకోదండ వేసింది.

ఆ పక్కనే ఇంకో ఫోటో, అందులో కొందరు అడవాళ్ళున్నారు. వాళ్ళల్లో ఒంటిమీద ఒక్క రైకూ బట్టల్లేవు. కొందరు మడుగు నీళ్ళల్లో సగం మునిగున్నారు. ఒకామె రెండు చేతులూ గుండెలమీద పెట్టుకొంది. ఒకామె ఒక చేత్తో ఓ గుండె కప్పుకొని పక్కకి తిరిగింది. ఇంకో ఇద్దరు చేతులు పైకెత్తి చెట్టుకేసి చూస్తూ నమస్కరిస్తున్నారు. ఆ చెట్టుమీద కొంటె కృష్ణుడు చిలిపిగా నవ్వుతున్నాడు. ఆ చెట్టునిండా రంగురంగుల చీరెలున్నాయి. ఆబొమ్మని చూడగానే తనకి నవ్వు వచ్చింది, కాని ఆ బొమ్మనీ తననీ చూచి సిగ్గుపడిన మున్నీని చూచి తానూ సిగ్గుపడిపోయాడు.

ఆ బూతు బొమ్మనీ, ఆవు దగ్గర నిల్చున్న తెల్లకృష్ణుడి బొమ్మనీ, నదిలో పెద్ద పాముమీద చిందులు తొక్కుతున్న ఇంకో చిన్ని కృష్ణుడి బొమ్మనీ ఇందాకటి దొరబాబు ఫోటోని, అన్నింటినీ పెట్టుకొని ఆ వేళ మున్నీ, వాళ్ళమ్మా, పూజచేసేరు. అయితే—అంటీ తాను ఒక్కర్తే పూజలు చేయవచ్చునుగాని అందరు ఆడవాళ్ళతోనూ....అంటే భర్తలున్నవాళ్ళతో కలిసి వ్రతాలు చెయ్యకూడదన్నమాట! అదెందుచేతో?

ఆ సాయంత్రం "కృష్ణలీలలు" సినీమాకని మున్నీ అంటీ బయల్దేరుతూంటే తానూ వెంటబడ్డాడు. "మీ అమ్మగారితో చెప్పేరా" అంది అంటీ. చెప్పేనని బొంకి తానూ బయల్దేరాడు. ఆ సినిమాలో కృష్ణుడేవో చిలిపిపనులూ,

కొంటెపనులూ చేస్తూవుంటే మున్నీ, ఆంటీ ఎంతో ఉత్సాహంగా చూస్తున్నారు. ఇంతలో మున్నీ గదిలోని బూతు బొమ్మ కథ వచ్చింది. మడుగులో స్నానం చేస్తున్న గోపికలు గట్టుమీద విడిచిన చీరలెత్తుకొనిపోయి కృష్ణుడు చెట్టుమీద కూర్చున్నాడు. వాళ్ళు కృష్ణా! కృష్ణా! అని మొరపెట్టుకొంటున్నారు. చేతుల్తో ఒళ్ళు కప్పుకుంటూ. కృష్ణుడు చిలిపిగా నవ్వుతూ "మీ శరీరాల మీద మమకారాలు విడిచి నన్ను మొక్కుకుంటే మీ చీరెలు మీ కిచ్చేస్తాను" అన్నాడు. వాళ్ళు వెంటనే సిగ్గువిడిచి చేతులెత్తి జోడించి కృష్ణా! కృష్ణా! అన్నారు. కృష్ణుడు వాళ్ళకి చీరలిచ్చేసాడు....ఆ తర్వాత చాలా కథ నడిచింది.

సినీమానుండి ఇంటికి వస్తూ ఆంటీ నడిగాడు. "మమకారాలు విడవమన్నాడు గోపికల్ని కృష్ణుడు.... మమకారాలంటే ఏఁవిటి? వాటినెలా తెంచుకుంటారు? వాటికీ చీరెలివ్వడానికి సంబంధం ఏఁవిటీ?" అని అడిగాడు.

"మమకారం అంటే శరీరంలోని కోరికలు. వాటిని చంపుకొని దేవుడికి మొక్కుకుంటే పుణ్యం వస్తుందట. ఆ పుణ్యం సంపాదిస్తే స్వర్గం వస్తుందట ఆ స్వర్గంలో ఏ చికాకులు ఉండవు. అంతా నవ్వుతూ, హాయిగా, సంతోషంగా సుఖంగా ఉంటారట...." ఇలా ఆంటీ చెబుతూండగానే టపటప రెండు మూడుగా పడిన చినుకులు హోరుమనే గాలితోపాటు కుండపోత వర్షంగా మారిపోయింది. అంతా తడిసి ముద్దముద్దగా యింటికి చేరుకున్నారు. అంతా ఓ తృటిలో,

ఇంట్లో అడుగు పెడుతూండగానే అమ్మ అందర్నీ కలిపి తిట్లకి లంకించుకుంది. నాన్నగారు చిన్నబుచ్చుకుని తప్పుకొన్నారు. "వేళాపాళాలేకుండా అడ్డమైన వాళ్ళతోనూ సినిమాలొకటి తక్కువయ్యాయిరా నీకు" తననో చెంపపెట్టు పెట్టింది. మున్నీ వణికిపోయింది. "లేదండి భక్తిరసం సినిమా కదా అని కృష్ణ లీలలు సినిమాకి...." అని ఆంటీ ఇంకా ఏదో చెప్పబోతుంటే అమ్మ విరుచుకుపడింది.... "చూస్తూనే ఉన్నామమ్మా నీ లీలలు. ఇంక కృష్ణలీలలొకటే తక్కువ.... నా పిల్లాడేమైనా అయిపోతే ఆ వేళ ఎవరూ రారమ్మా...." ఇంకా ఏవేవో అంది. ఆంటీ తెల్లబోయి ఏఁవీ మాట్లాడకుండా పెరట్లోని తన గదిలోకి ఏడుస్తున్న మున్నిని తీసుకుని వెళ్ళిపోయింది.

బట్టలు మార్చుకొని మంచంమీద ఒరిగిన తనకు ఆ రాత్రి నిద్రలో.... చెట్టుమీద కృష్ణుడు—మడుగులో గుడ్డలేకుండా గోపికలు.... తిట్టుకుంటూ మీద కొస్తున్న రాక్షసులూ.... దీనంగా ఉన్న ఆంటీ మున్నీల ముఖాలూ.... అవన్నీ మెదిలాయి.

తెల్లవారాక ఆంటీ గదిలోకి వెళ్ళాడు. గోడకి వున్న సూటుమనిషి ఫొటోకి నమస్కారంపెట్టి దానికున్న పూలదండ తీసి డ్రాయరుమీద పెట్టింది ఆంటీ.

"అమ్మ మాటలకి కోపం వచ్చిందా, ఆంటీ ?"

ఆవిడ నవ్వేసి వూరుకుంది. ఎంత మంచిది ఆంటీ!

"ఆ ఫోటోలో ఆయనెవరు ఆంటీ ?"

"మున్నీ నాన్నగారు...."

"ఆయనకి పూజచేయటానికేనా రోజూ అన్ని పువ్వులు కొంటారు ?"

"అవును బాబూ! నిన్న ఆయన పుట్టినరోజు. నేను చేసుకో గలిగే పూజ అదొక్కటే !...." అంటూ కళ్ళు తుడుచుకుంది. పక్కనేఉన్న మున్నీ ఎవరిమీదో కోపంతోనూ దిగులుగానూ ముఖం ముడుచుకుని వుంది.

మున్నీ నాన్నగారున్నప్పుడు ఆయన పెద్ద ఉద్యోగం చేసేవారనీ, తాన న్నివ్రతాలూ పూజలూ భారీగా చేసేదనీ, వాళ్ళ యిల్లంతా ఎంతో నిండుగా సం దడిగా ఉండేదనీ, ఆంటీ చెప్పింది.

పుణ్యం సంపాదించు కోవాలన్నా ఆంటీ వ్రతాలూ పూజలూ సైతం చేయడానికి వీల్లేదన్నమాట! అమ్మగాని మరే పునిస్త్రీగాని ఆవిడని పిలవరన్న మాట! మరి ఆంటీకి పుణ్యం రావడం కోసం తానూ మున్నీ మంచిమంచి పనులుచేస్తే: తామే వ్రతాలూ పూజలూ ఆంటీకి బదులుగా చేస్తే! ఆంటీకి పుణ్యం సంపాదించవచ్చును. అప్పుడు మున్నీకి బాగా చదువొస్తుంది. పెద్ద డాక్టరవుతుంది. ఆంటీకి అప్పుడు పుణ్యం పండినట్టే.

మున్నీ తానూ ఇటుపైని అన్ని పూజలూ, పండుగలూ కలిసి ఆంటీ ఇంట్లోనే జరిపించుదామని నిశ్చయించుకున్నారు.

తలచుకున్న ఏ పనికీ ఆటంకం లేకుండా చూచే దేవుడొకడున్నాడు. అతను పార్వతీ పరమేశ్వరుల ముద్దుబిడ్డ. అతన్ని కొలిస్తే ఏ ఆటంకాలూ వుండవు. ఆ రోజు వినాయక చవితినాడు ఆంటీ యిచ్చిన డబ్బుతో పాలవెల్లి తెచ్చి దానికి మున్నీ తానూ వెలక్కాయలూ, సీతాఫలపు కాయిలూ, మామిడాకులూ కట్టారు. పత్రులూ, పువ్వులూ తెచ్చారు. అమ్మ పిలిచినా అరిచినా తన యిల్లో పూజకూర్చోకుండా ఆంటీచేతా మున్నీచేతా. వినాయక వ్రతకల్పం పుస్తకంలో పూజా, కథా తానే చదివి పూజ చేయించేడు. అమ్మ అందరినీ కలిపి తిట్టేసింది. అమ్మని లక్ష్యపెట్టడం మానేసాడు తను.

ఏనుగుల్లాంటి నల్లటి మేఘాలు ఆకాశాన్ని అదరగొట్టేసే రోజులు పోయాయి. దసరాకి బడులు మూసివేసారు. ఊళ్ళో ఎక్కడెక్కడ దసరా వేడుకలు జరిగినా అక్కడకి మున్నీ తానూ హాజరయి సరదాగా సెలవులు గడిపేసారు.

కొన్నాళ్ళకు దీపావళి వచ్చింది. ఆ వేళ మున్నీని కాన్వెంటులో జాయిన్ చేసిన వాళ్ళ మేనమామ దీపావళి సామాను తెచ్చి యిచ్చి వెళ్ళిపోయాడు. తాను కొనుక్కున్న సామాను కూడా మున్నీకిచ్చి కాల్పించేడు. ఆ రాత్రి మున్నీ కాకర పువ్వొత్తులకంటే, మతాబాముద్దలకంటే, చించుబుడ్డి వెలుగుల కంటే యెక్కువగా వెండితీగలా, బంగారబ్బంతిలా వెన్నెల వానలా ధగధగా మెరిసిపోయింది.... ఆంటీ కళ్ళల్లోని కాంతిలా, ఆమె నవ్వులోని వెలుగులా.

పండగలన్నివచ్చి వెళ్ళినా ఆంటీ ఇంట్లో ఏదో వెలితి మిగిలిపోతూనే వచ్చింది! తన ఇంట్లో అమ్మా నాన్నా నిత్యం కీచులాడుకున్నా ఏదో నిండుదనం వుంటూనే వుంది! బహుశా ఇదే అమ్మ చేసుకొన్న పుణ్యమేమో. మరి! ఆంటీకెందుకు రాకూడదూ ఆ పుణ్యం? మున్ని పెద్ద డాక్టరయి. పెద్ద పేరు తెచ్చుకొని, పెళ్ళిచేసుకొని వచ్చి అమ్మని పలకరిస్తే అమ్మ అప్పుడేమంటుందో!

* * * *

ఊరు చివర కొండకి విహార యాత్రకి కార్లలోనూ బస్సుల్లోనూ రిక్షాల్లోనూ, సైకిళ్ళమీదా, నడిచీ, చాలామంది వెళ్తుంటే ఆంటీ నడిగేడు తను. "ఎందుకలా వెడతార"ని.

"ఈ నెల ఈశ్వరుడి కిష్టమైన నెల. ఈ నెలలో వుసిరిక చెట్లక్రింద కూచొని అన్నాలు తింటే పుణ్యంవస్తుంది" అంది ఆంటీ.

ఒక ఆదివారం నాన్నగారి ఆఫీసువాళ్ళు భార్యా పిల్లల్తో బయల్దేరా రా కొండకి. నాన్నగారు అమ్మని రమ్మంటే రానంది. నాన్నగారి కోసం జీపు వచ్చింది. తానూ సిద్ధమయ్యాడు నాన్నగారితో. మున్నీ? మున్నీ ఒస్తే బావుణ్ణు అని తనకి అనిపించేటంతలో పంజాబీ డ్రెస్సు వేసుకొని వచ్చింది. భుజాల మీదుగా నీలం కండువా వేసుకొంది. నాన్నగారు మున్నీని తమతో రమ్మన్నారు. అమ్మ విసుక్కొన్నా ఆయన వినలేదు. ఆంటీతో తాను మున్నీని తీసుకువెడుతున్నానని చెప్పేరు. జీపు బయల్దేరింది.

కొంతసేపట్లో వూరు చివర కొండదగ్గరికి చేరుకొంది జీపు. అక్కడ బంగళానిండా జనం! చెట్టుచెట్టుకీ జనం! అన్ని వయసులవాళ్లూ వున్నారు. వంటలు! పేకాటలు! కబుర్లు! నవ్వులు! పాటలు! సందడి సందడి! రంగుల రంగుల దుస్తులు! రంగుల రంగుల పువ్వులు!

ఓ చెట్టు క్రింద నాన్నగారి ఆఫీసువాళ్ళు చేరారు. మున్నీ తానూ టిఫిన్ తినేసి అ పక్క జలధారలో చేతులు కడుక్కున్నారు. ఆ ధార ఎంతో చల్లగా హాయిగా ఆంటీ నవ్వులా, మాటలా వుంది. ఆ నీళ్ళెంతో తియ్యగా వున్నాయి. కొండమీదనుంచీ కట్టిన కాలవలోంచి వస్తోంది ఆ ధార. ఆ కాలవ పక్కనుంచే కొండమీదికి జనం వెళ్తూ, వొస్తున్నారు. తమ పక్కనుంచే మాసిన గెడ్డంతో, చినిగిన బట్టల్తో నల్లగా కొండ దిగుతున్న ఓ ముసలతన్ని తానడిగాడు. "తాతా వీళ్ళంతా ఎట్నుంచొస్తున్నారు" అని.

"ఆ వేపు కొండమీది మడుగుంది బాబూ. అది సీతమ్మవారి స్నానానికి శ్రీరాములవారు తవ్వేరట. అదిచూస్తే పుణ్యం ఒస్తుంది" అని చెప్పిన తాత జనంలో కలిసి కొండదిగిపోయాడు.

గట్టు కట్టిన ఆ కాలవదారిని కొండనెక్కుతూ, అటూ ఇటూ మొక్కల్నించి రంగురంగుల పువ్వుల్ని తెంపుకుంటూ హాయిగా నవ్వుకుంటూ పోయి పోయి. అలసటతో ఆగుతూ, మళ్ళీ ఓపికతో సాగుతూ తరగని ఆ కాలవదారిని తరిగించుకొంటూ ఆ మడుగుని సమీపించేసరికి ఎండ ముదిరింది. చెమట

ముత్యాలు మున్నీ ముఖాన పూసేయి! అప్పటికే కొండదిగి భోజనాలకని మడుగు దగ్గర జనం దిగిపోయారు. ఇదో స్వర్గంలా వుంది. తానూ మున్నీ మిగిలేరు మడుగుదగ్గర.

ఈ మడుగులో మున్నీ ఓ గోపికగా, ఒడ్డున తాను కృష్ణుడుగా ఓ ఆలోచన మెరిసి ఆ మాటే మున్నితో అన్నాడు. ఆ ఆలోచనే అసలు మనసుని పులకరింతతో నింపింది! మున్నీ నవ్వుతూ గోపికలా మడుగులోకి దిగింది.

"మమకారం తెంచుకొని చేతులెత్తి మొక్కు. పుణ్యం ఒస్తుంది" తానచ్చం కృష్ణుడిలాగానే అన్నాడు. మున్నీ సిగ్గునీ, నవ్వునీ మడుగు గల గలలూ ఓ నీలం ఓణీ కప్పివేసాయి. ఆ మడుగులోకి పోతూ, పోతూ మున్నీ.... తెల్లటి చేతులెత్తిన మున్నీ........

నలుగురూ వచ్చి రక్షించే లోపునే—అంతా అయిపోయింది!!

ఆకాశంలో కామధేనువులాటి, కల్పవృక్షంలాటి, ఐరావతంలాటి, మబ్బుల నీడ క్రింద.... ఆ నీలినీలి మడుగుమీద అంటీ చేసుకున్న పుణ్యం అంతా ముద్దముద్దగా తేలిపోయింది ....!

తమ ఇంటి పెరట్లో మురళి పడుకున్న మంచం పక్కన కార్తీక దీపాలు కొడిగడుతున్నాయి....

—1974 (స్వాతి మాసపత్రిక)

కథా నిలయం
4556
శ్రీకాకుళం